క్లుప్తంగా

నేడు వరకవిపూడికి మంత్రి కాకాణి రాక

తోటపల్లిగూడూరు : మండలంలోని వరకవిపూడి గ్రామానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం వస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్ తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీరోడ్లను ప్రారంభించడంతో పాటు గ్రామంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి కాకాణి పాల్గొంటారన్నారు.

జోనల్ ఫుట్‌బాల్ టోర్నీకి ఆతిథ్యం

ముత్తుకూరు : 2023–24 సీబీఎస్‌ఈ క్లస్టర్–7 అండర్–19 జోనల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు తాము ఆతిథ్యం ఇస్తున్నట్లు గోపాలపురంలోని అదాని వరల్డ్ స్కూల్ ప్రిన్సిపల్ సత్యనారాయణ ఒక ప్రకటనలో చెప్పారు. ఈనెల 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఈ టోర్నమెంట్ జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు విడవలూరులో జగనన్న ఆరోగ్య సురక్ష

- హాజరుకానున్న ఎమ్మెల్యే ప్రసన్న

విడవలూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం గురువారం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ శిబిరానికి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హాజరవుతారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. శాశ్వత ఉభయకర్తల గోత్రనామాలతో పూజలు, సాయంత్రం మందిరంలో భజనలు, రాత్రి స్వామివారికి పల్లకిసేవ గావించారు. శేజ్‌హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బాలల హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి పిలుపునిచ్చారు. నగరంలోని మహిళా ప్రాంగణంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో భేటీ బచావో..భేటీ పడోవాపై గురువారం సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. బాలల విద్య, ఆరోగ్యం, శ్రేయస్సు కోసం బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పనిచేస్తుందన్నారు. 14 ఏళ్లలోపు బాలలకు విద్యను అందించేందుకు బాలల నిర్బంధ ప్రాథమిక విద్య హక్కు చట్టాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. సచివాలయ వ్యవస్థ సహకారంతో ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు, ఏఎన్‌ఎంలు బడిబయట ఉన్న బాలలను గుర్తించి వెంటనే ఎంఈఓ దృష్టి తీసుకొచ్చి బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీధి బాలల గుర్తింపును స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని సూచించారు. డ్రగ్స్ బారిన పడిన వారికి కౌన్సిలింగ్ ఇచ్చేందుకు ప్రత్యేకంగా పునరావాస కేంద్రాలను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పిల్లలు సైబర్ నేరాల బారిన పడకుండా, సెల్‌ఫోన్లకు బానిసలు కాకుండా ప్రత్యేక కార్యక్రమాన్ని నవంబరులో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్ పీడీ హేనాసుజన, డీఈఓ గంగాభవాని, జిల్లా వైద్యాధికారి పెంచలయ్య, ఆర్‌ఐఓ శ్రీనివాసులు, ఐటీడీఏ పీఓ రాణి, డీఎల్‌సీ వెంకటేశ్వర్లు, ఎస్‌ఎస్‌ఏ పీఓ ఉషారాణి, సోషల్‌వెల్ఫేర్ డీడీ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ నంబర్లాటగాళ్ల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): నగరంలోని టెక్కేమిట్ట, సారాయంగడి సెంటర్ (ప్రగతినగర్)లో సింగిల్ నంబర్లాటపై దర్గామిట్ట పోలీసులు గురువారం దాడులు చేశారు. సింగిల్ నంబర్లాటగాళ్లను అరెస్ట్ చేసి నగదు స్వాధీనం చేసుకున్నారు. టెక్కేమిట్టలో ముగ్గురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.1700 స్వాధీనం చేసుకున్నారు. సారాయంగడిసెంటర్‌లో నలుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.980 స్వాధీనం చేసుకున్నారు.

చిరకాల స్వప్నం.. సాకారం

- వెంకటాచలంలో అట్టహాసంగా జగనన్న కాలనీ ప్రారంభం
- లబ్ధిదారుల ఆనందోత్సాహం

వెంకటాచలం : సర్వేపల్లి నియోజకవర్గ కేంద్రమైన వెంకటాచలంలో పేదల సొంతింటి కల గురువారం నెరవేరింది. ఏళ్ల తరబడి నుంచి సొంత ఇళ్లు మంజూరు చేయాలని తిరుగుతున్న పేదల బాధలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నెరవేరుతోంది. ప్రతిపక్ష టీడీపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి లెక్కచేయకుండా పేదల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించి గురువారం ప్రారంభించారు.

ఏళ్ల తరబడి అద్దె నివాసాల్లో..

మండల కేంద్రమైన వెంకటాచలంలో ఏళ్ల తరబడి పేదలకు ఇళ్ల పట్టాలు, ఇళ్లు మంజూరు కాకపోవడంతో అద్దె నివాసాల్లో మగ్గుతూ వచ్చారు. ఈ సమస్యను గత టీడీపీ పాలనలో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి దృష్టికి పేదలు తీసుకువచ్చారు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఇళ్ల పట్టాలు, ఇళ్లు మంజూరు చేయడం లేదని వాపోయారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కల నెరవేరుస్తారని అప్పట్లో పేదలకు కాకాణి గోవర్ధన్‌రెడ్డి నచ్చజెప్పారు. చెప్పినట్లుగానే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదల సొంతింటి కల సాకారం అవుతోంది.

ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ

పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపారు. అందులో భాగంగానే వెంకటాచలంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న రూ.కోట్ల విలువ చేసే 6.96 ఎకరాల స్థలాన్ని చదును చేయించి లేఅవుట్లు నిర్మించి 230 మంది లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించారు. లేఅవుట్‌ను అభివృద్ధి చేయించి లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేలా ప్రోత్సహించారు. ఈ లేఅవుట్‌లో మొత్తం 203 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయగా, వాటిలో 82 మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించి గురువారం గృహ ప్రవేశాలు చేయించారు. ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలకు తోడుగా పొదుపు గ్రూపు మహిళలకు రూ.35 వేల వడ్డీలేని రుణం మంజూరు చేయించారు. ఎస్టీ లబ్ధిదారులకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రూ.15 వేలు ఆర్థిక సహకారాన్ని అందించి ప్రోత్సహించారు. వివిధ దశల్లో ఉన్న మిగతా ఇళ్లను కూడా త్వరితగతిన పూర్తి చేయించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.



కార్యక్రమానికి విశేషంగా తరలివచ్చిన మహిళలు



వెంకటాచలంలోని జగనన్న కాలనీలో గృహ ప్రవేశాలను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

జగనన్న కాలనీలో అభివృద్ధి పనులు

వెంకటాచలం జగనన్న కాలనీలో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలతో పాటు వివిధ అభివృద్ధి పనులను కూడా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పూర్తి చేయించారు. జాతీయ రహదారి వద్ద నుంచి జగనన్న కాలనీ ఎంట్రెన్స్‌లో రూ.4.90 లక్షలతో వైఎస్సార్ జగనన్న కాలనీ ఆర్చి నిర్మాణం చేపట్టారు. ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటుకు రూ.12 లక్షలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.9.84 లక్షలు, అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ.20 లక్షలు, ఇంకుడు గుంతల ఏర్పాటుకు రూ.5.70 లక్షలు వెచ్చించి పనులన్నీ పూర్తి చేయించారు. అలాగే కాలనీ మొత్తానికి విద్యుత్ సరఫరాకు స్తంభాల ఏర్పాటు, విద్యుత్ లైన్లను ఏర్పాటు చేయడంతో లబ్ధిదారులు సంతోషంగా ఇళ్లలో చేరబోతున్నారు.



మంత్రి కాకాణితో లబ్ధిదారుల ఆనందం

అన్ని వసతులతో ప్రారంభం

వెంకటాచలం జగనన్న కాలనీని అన్ని వసతులతో ప్రారంభించాం. కాలనీలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించక ముందే రోడ్లు, నీటి వసతి, విద్యుత్ సౌకర్యం వంటి వసతులను లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించారు. ప్రస్తుతం 82 మంది లబ్ధిదారుల ఇళ్లు పూర్తవగా, మిగతా లబ్ధిదారుల ఇళ్లను త్వరలోనే పూర్తి చేయిస్తాం.

– సీహెచ్.వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ

పండగ వాతావరణంలో..

రాష్ట్ర వ్యాప్తంగా పూర్తయిన ఇళ్ల నిర్మాణాల గృహ ప్రవేశాల కార్యక్రమం గురువారం నిర్వహించారు. అందులో భాగంగా వెంకటాచలం జగనన్న కాలనీలో పూర్తయిన ఇళ్లకు సంబంధించి శిలాఫలకాన్ని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మంత్రి కాకాణితో పాటుగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్యేలు మానుగుంట మహీధర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు బల్లి కల్యాణ్ చక్రవర్తి, పి.చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్ని ఇళ్లను ప్రారంభించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ పండగ వాతావరణంలో లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేశారు. లబ్ధిదారులకు గ్రామ సర్పంచ్ మండల రాజేశ్వరి ఆధ్వర్యంలో పండ్లు, చీర, పంచె, పసుపు, కుంకుమను మంత్రి కాకాణి చేతుల మీదుగా అందజేశారు.

15 నుంచి నవరాత్రి ఉత్సవాలు



ప్రత్యేకాలంకరణలో కన్యకాపరమేశ్వరీదేవి

పొదలకూరు : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో దసరా నవరాత్రి ఉత్సవాలు 15 నుంచి 27వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తామని దేవస్థానం పాలకమండలి అధ్యక్ష, కార్యదర్శులు ఆదూరు వెంకటసుబ్బయ్య, రాచపూటి రామలింగయ్య తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, గ్రామోత్సవాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. ఆదివారం రాత్రి కన్యకాపరమేశ్వరి అలంకరణతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయని చెప్పారు. నవరాత్రుల అనంతరం మరో నాలుగు రోజులు అదనంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో..

పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు దసరా నవరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని దేవస్థానం పాలకకమిటీ పేర్కొంది. వీరలక్ష్మి, విజయలక్ష్మి, సంతానలక్ష్మి, ధైర్యలక్ష్మి, ధాన్యలక్ష్మి, ధనలక్ష్మి, గజలక్ష్మి, విద్యాలక్ష్మి, ఆదిలక్ష్మి అలంకరణలతో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తారన్నారు. ప్రతిరోజు ఉదయం 9 గంటలకు, రాత్రి 7 గంటలకు అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. ఉభయకర్తలుగా వ్యవహరించాలనుకునే వారు దేవస్థానం నిర్వాహకులను సంప్రతించాల్సిందిగా సూచించారు.

షూటింగ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో ఇన్‌చార్జి హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కోవూరు : మండలంలోని పాటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో షూటింగ్‌బాల్ జిల్లా జట్లను గురువారం ఎంపిక చేశారు. అండర్–14 కింద 12 మందితో కూడిన బాలురు, బాలికల జట్లను ఎంపిక చేశారు. వీరు ఈనెల 18, 19వ తేదీల్లో అన్నమయ్య జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని షూటింగ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి భీమతాటి వెంకటరమణయ్య తెలిపారు. ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం డాక్టర్ జుల్ఫికర్ అలీ అహ్మద్, పీడీలు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా..



మాట్లాడుతున్న కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, వేదికపై ఎంపీలు విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి, ఆదాల



సమావేశానికి హాజరైన కోవూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

వైఎస్సార్‌సీపీ కోవూరు నియోజకవర్గ సమీక్ష సమావేశం నెల్లూరు రూరల్ నియోజకవర్గం కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్‌లో గురువారం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వేణుంబాక విజయసాయిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కలిసి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు సలహాలు అందించారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ కేడర్‌కు దిశా నిర్దేశం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యం

- జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

మనుబోలు : పేదలందరికీ మెరుగైన వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యురాలు చిట్టమూరు అనితమ్మ అన్నారు. మనుబోలు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల చెంతకే వైద్య సేవలను తీసుకొచ్చేందుకే ప్రభుత్వం ఆరోగ్య సురక్ష శిబిరాలను ఏర్పాటు చేస్తోందని, దీనిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యులు సుబ్బరాజు, గేయ పూజిత, చందన, జ్ఞానప్రసూన రోగులను పరీక్షించి మందులు అందజేశారు. అంగన్‌వాడీలు తక్కువ ఖర్చుతో తయారు చేసిన పౌష్టికాహారం స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో మొత్తం 354 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పరిశీలించి, వైద్యులకు పలు సూచనలు చేశారు. సర్పంచ్ కంచి పద్మమ్మ, ఉప సర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు దువ్వూరు రాజేశ్వరమ్మ, ఎంపీడీఓ ప్రసాద్, ఈఓపీఆర్డీ వెంకటరమణ, ఏఓ రవికుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత చిట్టమూరు అజయ్‌రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మనుబోలు : మెడికల్ కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు అనితమ్మ తదితరులు

700 మందికి వైద్యపరీక్షలు

పొదలకూరు : పొదలకూరు బిట్–1 సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను గురువారం నిర్వహించారు. పట్టణంలోని టైలర్స్‌కాలనీ, కాకాణి నగర్ తదితర ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో రోగులు శిబిరానికి హాజరై పరీక్షలు చేయించుకున్నారు. వలంటీర్లు వారికి సహాయ, సహకారాలు అందించారు. పొదలకూరు కో–లొకేటెడ్ వైద్యాధికారి కావ్యశ్రీ శిబిరాన్ని ఏర్పాటుచేశారు. హెల్ప్‌డెస్క్ ద్వారా క్యాంపునకు వచ్చిన రోగులను వలంటీర్లు, సిబ్బంది వైద్యనిపుణుల వద్దకు తీసుకెళ్లారు. ఇంటింటి సర్వేలో అందజేసిన టోకెన్ల ద్వారా 500 మందికి, నేరుగా మరో 200 మంది కలిపి మొత్తం 700 మంది ఈ సురక్ష శిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. డాక్టర్ జయరాజ్, డాక్టర్ మల్లికార్జున్ పాల్గొన్నారు. ఈ శిబిరాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, ఎంపీటీసీ సభ్యులు ఎస్‌కే జాకిరాబేగం, జి.లక్ష్మీకల్యాణి, సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి ప్రారంభించారు. సెక్రటరీ ఎస్‌కే అల్లాభక్షు రోగులకు వసతులను కల్పించారు.

పేదలకు ఆరోగ్య భద్రత

ముత్తుకూరు : పేద కుటుంబాలకు ఆరోగ్య భద్రత కల్పించాలన్న లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభమైందని ఎంపీపీ గండవరం సుగుణ అన్నారు. మండలంలోని తాళ్లపూడి సచివాలయంలో మామిడిపూడి సర్పంచ్ కె.మస్తానమ్మ అధ్యక్షతన, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మెట్టా విష్ణువర్ధనరెడ్డి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. రికార్డు స్థాయిలో 475 మంది వైద్య పరీక్షలు చేయించుకోగా వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య నిపుణులు వినీల, కృష్ణచైతన్య, హర్షిత, సునీల్‌కుమార్‌తో పాటు వారి సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉపసర్పంచ్ గోపాల్, పార్టీ నేతలు పెమ్మారెడ్డి పద్మనాభరెడ్డి, మండల పరిషత్ సూపరింటెండెంట్ లక్ష్మణరావు, కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.

పేదల చెంతకే వైద్యసేవలు

ఇందుకూరుపేట : ఖరీదైన వైద్యసేవలను రాష్ట్ర ప్రభుత్వం ప్రజల చెంతకే తీసుకొస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కె.నాగేంద్రబాబు కోరారు. మండలంలోని గంగపట్నం సచివాలయంలో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను ఎంపీడీఓ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వసుంధర, వైఎస్సార్‌సీపీ నేతలు పంబాల జనార్దన్‌రెడ్డి, వేణుబంబాక మహీధర్‌రెడ్డి, ఎంపీటీసీ గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకునేలా కృషి చేయండి

కొడవలూరు : జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు కృషి చేయాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు కోరారు. మండలంలోని నార్తురాజుపాళెం సచివాలయం–2లో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి ఆయన హాజరై, మాట్లాడారు. ఈ శిబిరానికి వచ్చిన వారికి కేర్ షీట్ కూడా ఇస్తారని, అందులో వారి ఆరోగ్య సమస్యలను నమోదు చేస్తారని వివరించారు. అనంతరం అవ్వతాతలకు మంజూరైన కంటి అద్దాలను ఆయన పంపిణీ చేశారు. ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఎంపీపీ జి.జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియ, ఎంపీటీసీ సభ్యుడు పోశంరెడ్డి అనిల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నేతలు కె.శ్రీనివాసులురెడ్డి, ఎన్.మాణిక్యరావు, పంచాయతీ కార్యదర్శులు జి.జాలయ్య, జి.రాధాకృష్ణ, శివకుమార్ పాల్గొన్నారు.



పొదలకూరు : రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న మహిళా డాక్టర్

మానవత్వం చాటుకున్న వలంటీర్లు

నార్తురాజుపాళెంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి రెండు కాళ్లులేని వ్యక్తిని స్థానిక వలంటీర్లు సతీష్, ప్రతాప్ చేతులతో మోసుకొని శిబిరానికి తీసుకొచ్చారు. డాక్టర్ల చేత వైద్య పరీక్షలు చేయించి మందులు ఇప్పించి మరలా ఇంటి వద్దకు మోసుకెళ్లి దిగబెట్టారు. దీంతో వలంటీర్ల మానవత్వానికి అందరూ కొనియాడారు.

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం

విడవలూరు : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతున్నట్లు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి బెజవాడ వంశీకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని ఊటుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు గురువారం నిర్వహించారు. ఇందులో దాదాపు 692 మంది వైద్యసేవలు పొందినట్లు ఎంపీడీఓ జి.శ్రీనివాసరావు తెలిపారు. తహసీల్దార్ హమీద్, ఏపీఎం శివ, వైఎస్సార్‌సీపీ నేతలు పి.వెంకటకృష్ణారెడ్డి, కె.సాగర్, ఎస్.అయ్యప్ప, సర్పంచ్ వెంకటశేషమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు శేషమ్మ పాల్గొన్నారు.



పొదలకూరు : శిబిరానికి హాజరైన ప్రజలు



ముత్తుకూరు : తాళ్లపూడిలో వృద్ధురాలికి మందుల కిట్ అందజేత



ఇందుకూరుపేట : ఆరోగ్య సురక్షలో ఎంపీడీఓ నాగేంద్రబాబు, ప్రజాప్రతినిధులు

ప్రజారోగ్యమే లక్ష్యం

తోటపల్లిగూడూరు : ప్రజారోగ్యమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అడిషనల్ డీఎంహెచ్‌ఎం ఖాదర్‌వలి తెలిపారు. మండలంలోని చిన్నచెరుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యంపై ఎవరూ నిర్లక్ష్యంగా ఉండొద్దని, సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో 290 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హేమలత, తహసీల్దార్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట : పోషకాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు



తోటపల్లిగూడూరు : మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి



మనుబోలు : వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య



కొడవలూరు : రెండు కాళ్లు లేని వ్యక్తిని సురక్ష శిబిరానికి తీసుకొస్తున్న వలంటీర్లు



కొడవలూరు : వృద్ధురాలికి కంటి అద్దాలను అందజేస్తున్న చలపతిరావు